## చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు గల్లంతు



కోట, అక్టోబర్ 23 ప్రభాతవార్త
కోట మండలం కర్లపూడి పంచాయతీ మేకలతోటకు చెందిన మానికాల పోలయ్య (70) బుధవారం చల్లాకాలువలోకి చేపల వేటకు వెళ్లాడు. సాయంత్రం వరకు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. గురువారం గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో బోటు సహాయంతో చల్లకాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు మత్స్యకారుడు పోలయ్య ఆచూకీ లభ్యం కాలేదు. సంఘటన స్థలాన్ని తహశీల్దార్ కె.జయజయరావు, ఎంపిడిఓ దిలీప్‌కుమార్, ఎస్ఐ పవన్‌కుమార్ పరిశీలించారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## తిరుమలలో డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు

తిరుమల, అక్టోబర్ 23
ప్రభాతవార్త ప్రతినిధి:
అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజు గురువారం రాత్రి తిరుమలకు వచ్చారు. ఆయనకు గాయత్రి అతిదిగృహం వద్ద వసతికల్పన విభాగం ఓఎస్‌డి సత్రానాయక్ పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు. నేటి వేకువజామున ఆయన శ్రీవారిసేవలో పాల్గొంటారు.



# తగ్గుముఖం పట్టని వర్షాలు

**మల్లెమడుగు డ్యాంకు భారీగా చేరిన వర్షపు నీరు..**
**11 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల**
**డ్యాం పరిశీలించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..**



మల్లెమడుగు గేట్లు ఎత్తివేసిన దృశ్యం

రేణిగుంట అక్టోబర్ 23 ప్రభాతవార్త.
అల్పపీడన వల్ల రేణిగుంట మండలంలో గురువారం కూడా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. వాగులు, వంకలు, కాలువల్లో నీరు పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. మండలంలోని పలు గ్రామాలు, రేణిగుంట పట్టణంలోని అనేక వీధుల్లో వర్షపు నీరు ఇళ్ళలోకి ప్రవేశించి గత మూడు రోజులుగా వంట చేసుకోవడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అన్ని చెరువులు నీటితో నిండి పోయాయి. ఎప్పుడు ఏ చెరువుకు గండి పడుతుందో నని ప్రజలు ఆందోళనలో ఉన్నారు. తిరుమల కొండపై ఉన్న అన్ని డ్యాముల గేట్లు ఎత్తివేయడంతో విపరీతంగా వరద నీరు మల్లెమడుగు రిజర్వాయర్ చేరుకుంటుంది. రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో ఇరిగేషన్ అధికారులు డ్యాం 11 గేట్లను ఒక అడుగు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. సాయంత్రం 6 గంటలకు రిజర్వాయర్‌కు 1800 క్యూసెక్కుల ఇన్ఫ్లో నీరు వస్తుండగా, అవుట్ ఫ్లో 1950 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. రెవిన్యూ పోలీస్ అధికార యంత్రాంగం లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న బాధితులకు అన్నం పొట్లాలను అందజేశారు. మధ్యాహ్నం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మల్లెమడుగు రిజర్వాయర్ ను సందర్శించారు. డ్యాం స్థితిగతులను అధికారుల ద్వారా ఆరా తీశారు. ప్రజలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టిలో మల్లెమడుగు, బాలాజీ రిజర్వాయర్లు ఉన్నాయన్నారు. మల్లెమడుగు రిజర్వాయర్ ను 297 కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు భరోసా ఇవ్వాలని ఆదేశించారు. ఎమ్మెల్యే తో పాటు తాహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీవో రవిచంద్ర, రేణిగుంట అర్బన్ ఎస్సై నాగరాజు, ఇరిగేషన్ ఈఈ, డిఈ, ఏఈ లతోపాటు తిరుపతి పార్లమెంటరీ టిడిపి ఉపాధ్యక్షుడు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, కరకంబాడి క్లస్టర్ ఇంచార్జ్ బుజ్జి నాయుడు, శ్రీ కట్ట పుట్టలమ్మ దేవస్థానం చైర్మన్ పాడి రాజేంద్ర, టిడిపి సీనియర్ నాయకులు కే.వి చలం, ఉదయ భాస్కర్ రెడ్డి, జిల్లా టిడిపి రైతు సంఘం నాయకులు మునుస్వామి నాయుడు, టిడిపి మండల మాజీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు..

**నేడు మాజీ మేయర్ కఠారి హేమలత, మోహన్‌ల**

# హత్య కేసు తీర్పు



హత్యకు గురైన అప్పటి మేయర్ కఠారి అనురాధ, కఠారి మోహన్ (ఫైల్‌ఫోటోలు)

చిత్తూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త:
చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పదేళ్ళ క్రితం హత్యకు గురైన అప్పటి మేయర్ కఠారి హేమలత, ఆమె భర్త కఠారి మోహన్‌ల హత్య కేసు తీర్పు శుక్రవారం వెలువడనుంది. చిత్తూరు 6వ అదనపు జిల్లా జడ్జి కోర్టు నుండి తీర్పు వెలువడనున్న నేపథ్యంలో పోలీసులు చిత్తూరు నగర పరిధిలో విస్తృతంగా భద్రతా పరమైన ఏర్పాట్లు చేశారు. 2015 నవంబర్ 17వ తేదీ ఉదయం 11.45 గంటలకు నిందితులు చంద్రశేఖర్ అలియాస్ చింటూ, వెంకటాచలపతి అలియాస్ ముల్‌బాగల్ వెంకటేష్‌లు తుపాకులు, ప్రాణాంతకమైన ఆయుధాలతో బుర్ఖాలు ధరించి మరో ముగ్గురు సహ నిందితులతో కలిసి మేయర్ కార్యాలయంలోనే అప్పటి మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్‌లపై దాడి చేసి దారుణంగా హత్య చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఈ హత్యలు ఆస్తి, ఆర్థిక వ్యవహారాలతో జరిగిందని పోలీసులు నిర్ధారించారు. ఈ కేసులో చంద్రశేఖర్ అలియాస్ చింటూ, వెంటాచలపతి అలియాస్ ముల్‌బాగల్ వెంకటేష్‌తో పాటు 23 మంది నిందితులు వివిధ పాత్రలతో నేరానికి కుట్ర పన్నడం, నేరంలో పాల్గొనడం, ప్రధాన నిందితులకు ఆశ్రయం కల్పించడం, ఆయుధాలు సరఫరా చేయడం తదితరాలు చేశారని పోలీసులు చార్జ్‌షీట్‌లో పొందుపరిచారు. ఈ మేరకు పోలీసులు 18 ఫిబ్రవరి 2016న చార్జ్‌షీటు దాఖలు చేశారు. ఈ కేసులో ప్రస్తుతం ఎ22 కేసు నుండి విడుదల అయ్యాడు. ఎ 21 ఆయుధాలు సరఫరా చేసిన వ్యక్తి మృతి చెందగా, ఎ 3, ఎ4లు జిల్లా జైలులో నిర్బంధంలో వున్నారు. అలాగే ఎ1, ఎ2, ఎ5 నుండి ఎ20 వరకు నిందితులై బెయిల్‌పై వున్నారు. ఈ కేసు తీర్పు శుక్రవారం వెలువరించనుండటంతో జిల్లా కోర్టు పరిసరాల్లో కోర్టు సిబ్బంది తప్పా మరెవరికి అనుమతి లేదు. అలాగే చిత్తూరు నగర పరిదిలో పోలీసు యాక్ట్-30 అమలుల్లో వుంటుంది. చిత్తూరులో ప్రజలు గుంపులుగా చేరడం, తిరగడం నిషేధం. హత్యకు గురైన అప్పటి మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోమన్‌ల కోడలు ప్రస్తుత చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత ఇంటి వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు. అలాగే మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం నాయకులు సికె బాబు ఇంటి వద్ద ప్రత్యేక భద్రత ఏర్పాట్లను పోలీసులు చేపట్టారు. అలాగే తీర్పు వెలువరించే న్యాయమూర్తి నివాసం, ఎపిపి నివాసంల వద్ద బందోబస్తు ఏర్పాటు. అలాగే నేర పూర్వ చరిత్ర కలిగిన, జైలు నుండి విడుదలైన లేదా సమస్యాత్మక ప్రవర్తన కలిగిన నిందితులపై నిఘా, అనుమానస్పద వ్యక్తులపై నిరంతర పర్యవేక్షణ వుంటుంది. తీర్పు నేపథ్యంలో రెండు వర్గాలు సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేయకుండా విబేధాలు ప్రోత్సహించకుండా వుండేలా పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది.

**- చిత్తూరులో పోలీస్‌యాక్ట్-30 అమలు**
**- చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్యే సికె బాబు నివాసాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు**

# భారీ వర్షాలపై కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్

### తిరుపతి జిల్లా

తిరుపతి కలెక్టరేట్, అక్టోబర్, 23 ప్రభాతవార్త :
జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దుబాయ్ నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్ష ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. తిరుపతి జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు టెలి కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. వర్ష ప్రభావిత ప్రాంతాలైనా గుంటూరు, బాపట్ల, నెల్లూరు, ప్రకాశం, కడప, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, అనంతపురం, కర్నూలు జిల్లాలలో ముందస్తు చర్యలు తీసుకోవాలని వర్ష ప్రభావిత ఆయా జిల్లాల కలెక్టర్లను, ఎస్పీలను ఆదేశించారు. వర్ష ప్రభావిత ప్రాంతాలలో ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలను పంపాలని సూచించారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముఖ్యమంత్రికి వివరిస్తూ.. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండేలా అన్ని చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలలో భారీ వర్షం నేపథ్యంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

### చిత్తూరు జిల్లా

చిత్తూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త:
జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజల ప్రాణాలు, ఆస్తి నష్టం జరుగకుండా పక్కా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడిలను ఆదేశించారు. సిఎం నారా చంద్రబాబునాయుడు దుబాయ్ నుండి గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడిలతో జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు అధికార యంత్రాంగం చేపడుతున్న సహాయక చర్యలపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను పంపాలని, ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే లోతట్టు ప్రాంతాల్లోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి చర్యలు చేపట్టాలని, కాలువలు, చెరువులకు గండ్లు పడకుండా బలహీనంగా వున్నచోట పటిష్టం చేయాలని ఆదేశించారు. చెరువులు నిండిన అనంతరం ఆ నీటిని వృధా కాకుండా నిల్వ చేసుకోవాలని కోరారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఆహారం, పిల్లలకు పాలు లాంటి ఆహార పదార్థాలు అందుబాటులో వుంచాలన్నారు.

# ఆరోపణలపై ఆధారాలు ఇవ్వండి

**-వైసిపి నేత కరుణాకర్‌రెడ్డికి పోలీసుల ప్రశ్నలు**
**-వాస్తవాలు చెబుతుంటే నిందారోపణలు తగదు**




తిరుపతి, అక్టోబర్ 23 ప్రభాతవార్త:
టిటిడి ఎస్వీగోశాలలోగోవుల మరణాలపై మీరు చేసిన ఆరోపణలపై ఆధారాలు ఇవ్వాలని తిరుపతి టిటిడి మాజీఛైర్మన్, వైసిపి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డిని తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం ప్రశ్నించారు. మీరు చేసిన ఆరోపణల ఆధారాలు చూపాలని అన్నారు. ఇలా తప్పుడు ఆరోపణలు చేయడం మంచిదికాదుకదా అని ప్రశ్నించినట్లు సమాచారం. గురువారం ఉదయం యూనివర్సిటీ పోలీసుస్టేషన్‌లో ఇంకా పలు ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టారని తెలుస్తోంది. సుమారు అర్ధగంటసమయం భూమనను పోలీసులు గోవుల మరణాల ఆరోపణలపై ప్రశ్నించారు. అనంతరం ఆయనను పంపించారు.

–వాస్తవాలు చెబుతుంటే నిందారోపణలా!: భూమన

గోవుల మృతిపై చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని, గోవులు అధికంగా మరణిస్తున్నాయని మాట్లాడానని భూమన కరుణాకర్‌రెడ్డి మీడియాకు తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. గోవుల మరణాలపై అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా అసభ్యపదజాలంతో కూటమి నేతలు ఆరోపణలు చేస్తున్నారని అసహనం చెందారు. ఇప్పటివరకు తాను చేసిన ఆరోపణలపై ఏ ఒక్క ఆరోపణలు తేల్చిందిలేదన్నారు. వాస్తవాలు చెబుతుంటే నిందారోపణలు చేస్తున్నారని, తనపై విషప్రచారం చేస్తున్నారన్నారు. తప్పులు ఎత్తిచూపడం నా బాధ్యతఅని, మీరు నోటీసులు ఇచ్చినా ఏమి చేసినా ప్రశ్నించడం ఆగదని కరుణాకర్‌రెడ్డి తేల్చారు. ఎవరికి బిల్లులు ఇవ్వాలో చెప్పే అధికారం టిటిడి ఛైర్మన్‌కు ఉండదన్నారు. వాస్తవాలు చెబితే తనపై ఉసుగొల్పుతున్నారని కొంత అసహనం చెందారు.

## కాణిపాకంలో ఘనంగా ఆకాశ దీపోత్సవం



రాతి కొడి స్థంభం వద్ద దీపానికి పూజలు, కొడి స్థంభంపై దీపాన్ని ఎగువ వేస్తున్న ఈఓ

కాణిపాకం, అక్టోబర్ 23 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో కార్తీకమాసం సందర్భంగా బుధవారం రాత్రి ఆకాశ దీపోత్సవం కార్యక్ర మంను ఘనంగా నిర్వహించారు. కాణిపాకం దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగధాంబిగా సమేత మణికంఠేశ్వరాలయంలో ఈపూజలను నిర్వహించారు. గగన మార్గంలో తిరుగుతున్న పితృదేవతలు స్వర్గంలోకి వెళ్ళేందుకు వీలుగా వెలుగు చూపేందుకు కార్తీకమాసంలో ఆకాశ దీపోత్సవంను నిర్వహించడం జరుగుతున్నట్లు పండితులు తెలిపారు. ఈ మేరకు ఆలయంలో ఉదయం స్వామివారి మూల విరాట్‌కు అర్చకులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ధూపధీప నైవేద్యాలను సమరి ్పంచి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే సాయంత్రం నంది విగ్రహం వద్ద ద్వార దీపాన్ని వెలిగించి ప్రత్యేకపూజలు చేశారు. తిరగి రాత్రి ఆలయం ముందు భాగంలో వున్న రాత్రి కొడి స్థంభం వద్ద అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ప్రతే ్యకంగా దీపాన్ని ఏర్పాటు చేసి పూజలు చేసిన అనంతరం కొడి స్థంభంపై ఎగేర వేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురకుల్, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ కోదండపాణి, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

**తాడేపల్లి ప్యాలెస్‌లోనే**

## కల్తీ మద్యం ఫార్ములా రూపకల్పన

**ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ**



వెంకటగిరి, అక్టోబర్ 23, ప్రభాతవార్త
తాడేపల్లి ప్యాలెస్ నుంచే కల్తీ మద్యం కుట్రలు పుట్టుకొస్తున్నాయని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సంచలన ఆరోపణలు చేశారు. కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్రమైన విమర్శలు గుప్పించారు. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని లిక్కర్ మాఫియా రాజ్యంగా మార్చారని, 3,500 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఈ లిక్కర్ దోపిడీ నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కుట్రల పన్నాగాలు పన్నుతున్నారని మండిపడ్డారు. చిత్తూరు జిల్లా ములకలచెరువు, ఇబ్రహీంపట్నం ఘటనల వెనుక కూడా తాడేపల్లి ప్యాలెస్ కుట్రలే ఉన్నాయని తీవ్ర విమర్శలు చేశారు. కూటమి ప్రభుత్వాన్ని దెబ్బతీయాలనే దురుద్దేశ్యంతోనే ఈ కల్తీ మద్యం ఫార్ములా తాడేపల్లి ఫ్యాక్టరీలో తయారైందని ఎద్దేవా చేశారు. సెప్టెంబర్‌లో ఆఫ్రికా వెళ్లేందుకు టికెట్ బుక్ చేసుకున్న జనార్దన్‌రావు, 23వ తేదీన జోగి రమేష్‌ను ఇంటికి పిలిపించుకుని ప్రణాళికలు రచించారని తెలిపారు. ఈ ఇద్దరూ సన్నిహిత మిత్రులని, వీళ్లిద్దరూ కలసి కల్తీ మద్యం వ్యవహారానికి రూపురేఖలు సిద్ధం చేశారని దుయ్యబట్టారు. తనకు భూ ఆక్రమణలతో సంబంధం ఉందని వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు సత్యనారాయణ, చేనేత రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, రాష్ట్ర, నియోజకవర్గ అనుబంధ కమిటీ సభ్యులు, పట్టణ కమిటీ సభ్యులు, బాలాయపల్లి రూరల్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎవరికి వారే...!

**నేటి నుంచి శ్రీకాళహస్తి ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారాలు**
**పార్టీల వారీగా ప్రమాణాలకు లగ్నాలు**



శ్రీకాళహస్తి, అక్టోబర్ 23 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన సభ్యుల ప్రమాణ స్వీకారాల మహోత్సవాలు ఎవరి తిధి ప్రకారం వారు ప్రమాణ స్వీకారాలు చేయటానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మేరకు శుక్రవారం ఉదయం 7గంటలకు బిజెపి సభ్యురాలు కోలా విశాలాక్షి ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిసింది. కాగా తెలుగుదేశం పార్టీకి చెందిన వారు వారి పేర్ల ప్రకారం తిధి మేరకు శుక్రవారం సాయంత్రి 5గంటలకు ప్రమాణ స్వీకారం చేయటానికి నిర్ణయించినట్లు తెలిసింది. ఈ మేరకు శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ధృవీకరించారు. కాగా జనసేన పార్టీ తరఫున చైర్మెన్‌గా ప్రకటించిన కొట్టేసాయి తన పేరు బలం ప్రకారం ఈ నెల 26న ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. అందరు కలసి చైర్మెన్‌ను ఎన్నుకుంటారు. అయితే బయటి వారు కొందరు నవంబర్ 3న , తెలంగాణాకుచెందిన వారు వచ్చేనెల 10వ తేది ప్రమాణ స్వీకారం చేయటానికి నిర్ణయించినట్లు సమాచారం. అయితే కొట్టే సాయి మాత్రం పట్టణంలో ప్లేక్సీలు ఏర్పాటు చేసారు. అంతేకాక జనసేన పార్టీకి సంబంధించిన పౌరసరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్ ఈ నెల 26న శ్రీకాళహస్తికి రానున్నట్లు అధికారికంగా సమాచారం అందింది. ఆయన శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకొని అక్కడే చైర్మెన్ అభ్యర్థిగా ప్రకటించిన కొట్టే సాయితో పాటుజనసేనకు చెందిన వారు ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిసింది. అలాగే అదే రోజు ఎస్ఎస్ కన్వెన్షనల్ హాల్‌లో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆ సమావేశంలో నాదేండ్ల మనోహర్ హాజరౌతారని చెబుతున్నారు.

కొత్త సంప్రదాయం వరవడి:

ఇప్పటి వరకు శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఒకే పార్టీకి చెందిన వారిని సభ్యులుగా చైర్మెన్‌గా ప్రకటించే వారు. వారు ఒకే రోజు ప్రమాణ స్వీకారం చేసే వారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం లో మూడు పార్టీల వారికి అవకాశం ఉంది కాబట్టి ఎవరి పేరు బలాలకు సంబందించి వారు ప్రమాణ స్వీకారాలకు తేదీలు ఖరారుచేసుకున్నారు. దాంతో గందరగోళ పరిస్థితి చోటు చేసుకుంది. అందరిని సమన్వయ పరచి ఉంటే బాగుండేదని పరిశీలకులు చెబుతున్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన స్థానికంగా ఉండే వాకచర్ల గుర్రప్పశెట్టి, గాదిపాకుల గోపినాధ్, డి.లక్ష్మమ్మలు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం అందింది. ఈ సారి బోర్డు కూర్పులో అధినాయకుడు రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా తెలంగాణ వారికి కూడా అవకాశం కల్పించారు. వారందరూ ఒకే రోజు ప్రమాణ స్వీకారానికి పార్టీ అధినాయకత్వం నిర్ణయించి ఉంటే బాగుండేదని చర్చించుకుంటున్నారు. మూడు పార్టీలు మూడు ముక్కలాట అన్నట్లు ఎవరికి వారు ప్రమాణ స్వీకారం చేయటం చర్చనీయాంశంగా మారింది. బోర్డు కూర్పులో కొత్త వరవడి అలాగే ప్రమాణ స్వీకారంలో ఽకూడా కొత్త వరవడి చోటు చేసుకుంది. గతంలో కూడా తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో 2017లో నియమించిన బోర్డులో తెలుగుదేశం, బిజెపిలకు అవకాశం కల్పించారు. కానీ ఒకే రోజు ఒకే వేదిక మీద ప్రమాణ స్వీకారం చేసారు. ఈ మేరకు అధికారులకు సమాచారం కూడా అందినట్లు తెలిసింది.

## ఆస్తి పన్ను చెల్లింపుదారులపై సైబర్ నేరగాళ్ళ దృష్టి

**- చిత్తూరులో పలువురికి ఆస్తిపన్ను కట్టమని ఫోన్‌కాల్స్**

చిత్తూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త:
చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తిపన్ను చెల్లింపుదారులపై సైబర్ నేరగాళ్ళు దృష్టి కేంద్రీకరించారు. ఇప్పటికే సైబర్ నేరగాళ్ళ బారిన పడి పలువురు డబ్బులు పోగొట్టుకుంటున్న నేపథ్యంలో తాజాగా చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్ను చెల్లించాల్సిందిగా సైబర్ నేరగాళ్ళు ఫోన్లు చేస్తున్నారు. ఇప్పటికే మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆస్తిపన్ను చెల్లించే వారి జాబితాను తస్కరించిన సైబర్ నేరగాళ్ళు వారికి ఫోన్ చేసి ఆస్తి పన్ను చెల్లించాల్సివుందని, ఫోపే లేదా గూగుల్ పే ద్వారా ఆస్తి పన్ను చెల్లించాల్సిందిగా కోరుతున్నారు. ఈ విషయం మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ దృష్టికి వెళ్ళడంతో తమకు సైతం ఈ విషయంపై ఫిర్యాదులు అందాయని చిత్తూరు ప్రజలు ఎవ్వరు ఆస్తిపన్నును ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా చెల్లించవద్దని స్పష్టం చేశారు. సైబర్ నేరగాళ్ళు చిత్తూరు నగర పరిధిలోని పలువురికి ఫోన్ చేసి తాము మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుండి ఫోన్ చేస్తున్నట్లు చెల్లించాల్సిన ఆస్తిపన్నును ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా చెల్లించాలని కోరుతున్నారన్నారు. ఈ మేరకు 70137 98610 నెంబర్ నుండి పలువురికి ఆస్తి పన్ను చెల్లించాలని ఫోన్‌కాల్స్ వచ్చినట్లు గుర్తించడం జరిగిందని, ఈ మోసపూరిత ఫోన్‌కాల్స్‌పై ఆస్తిపన్ను చెల్లింపుదారులు అప్రమత్తంగా వుండాలని, ఇలాంటి ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ హెచ్చరించారు. అలాగే ఫేక్ ఫోన్ కాల్స్‌పై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందని, ఈ విషయంగా పోలీసులు విచారణ చేస్తున్నారన్నారు. ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఎదైనా అనుమానాలు వుంటే పన్ను చెల్లించడానికి నేరుగా మున్సిపల్ కార్యాలయంలోని పురసేవ కేంద్రం, సిడిఎంఎ వెబ్‌సైట్, వార్డు సచివాలయ పరిధిలోని అడ్మిన్ కార్యదర్శిని సంప్రదించి పన్ను చెల్లించాలన్నారు.

## వైకాపా బలోపేతంకు సైనికుల్లా కృషి

పెనుమూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త:



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని రాష్ట్ర వైకాపా కార్యదర్శి మహాసముద్రం దయాసాగర్‌రెడ్డి అన్నారు. పెనుమూరు పులిగుండు వద్ద గురువారం వైకాపా నాయకులు ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దయాసాగర్‌రెడ్డి మాట్లాడుతూ నాయకులు విబేధాలు వీడి కలసికట్టుగా కార్యకర్తలతో మమేకమై గతంలో తమ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సిఎంగా వున్న సమయంలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను సైతం ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాలన్నారు. స్థానిక ఎన్నికలు ఎప్పుడు జరిగినా మండలంలో వైకాపా ఖరారు చేసిన అభ్యర్థులను కలసికట్టుగా విజయం సాధించేలా ప్రణాళికలు రచించి అమలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైకాపా నేత మహాసముద్రం సురేష్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి, వైకాపా నాయకులు గోవిందరెడ్డి, కంచర్ల చక్రవర్తినాయుడు, కమలాకర్‌రెడ్డి, జయంద్రారెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, దామురెడ్డి, దూదిశంకర్, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల వేలం ద్వారా రూ.20.40 లక్షలు ఆదాయం

చిత్తూరు హెల్త్, అక్టోబర్ 23 ప్రభాతవార్త:

వాహనాల వేలం ద్వారా అటవీశాఖకు రూ.20.30 లక్షలు ఆదాయం లభించింది. జిల్లా అటవీశాఖలోని పలు డివిజన్లలో వివిధ నేరాల్లో సీజ్ చేసిన వాహనాలను గురువారం వేలం వేశారు. డిఎఫ్ఓ సుబ్బరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలంలో మొత్తం 38 వాహనాలను వేలం వేయగా 23 వాహనాలు వేలం పాటలో పాడుకున్నారు. మిగిలిన 15 వాహనాలను వివిధ కారణాలతో అటవీశాఖ అధికారులు వేలం వేయకుండా నిలుపుదల చేశారు.

## తాగునీటి నాణ్యత తప్పక పరిశీలించాలి

శాంతిపురం , అక్టోబర్ 23 ప్రభాతవార్త



గ్రామాల్లో ప్రజలకు అందిస్తున్న త్రాగునీటి నాణ్యత నుతప్పక పరిశీలించాలని ఎంపిడిఓ పిఆర్ కుమార్ పేర్కొన్నారు.గురువారం మండలంలోని నారసింహేపల్లి గ్రామంలో ఆయనపర్యటించి తాగునీటి నాణ్యత ప్రమాణాలుపరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రతి పదిహేను రోజులకు ఓసారి ట్యాంకులను శుభ్రం చేసి నీటిని సరఫరా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా చూడాలని కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ, కార్యదర్శి, ఇఎలు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## కేవీబీ పురం మండలంలో ఎమ్మెల్యే పర్యటన

కేవీబీ పురం, అక్టోబరు 23 ప్రభాతవార్త:



రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు పడుతున్న విషయం తెలిసిందే. దీంతో ప్రజలు, లో తట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తహసీల్దార్, ఎంపీడీవో, మండల స్థాయి అధికారులు మండల కేంద్రంలో 24 గంటలు కాల్‌సెంటర్ ఏర్పాటు చేసుకుని ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూడాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. గురువారం రాజులకండ్రిగ ఏరును పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో కల్లెక్టర్ రిజర్వాయర్, ఒళ్లూరు పాళెం రిజర్వాయర్, కాళంగి రిజర్వాయర్ ప్రదేశాలలో తుఫాను ప్రభావంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పోలీసు యంత్రాంగం ఎప్పటికప్పుడు ఇరిగేషన్ శాఖ అధికారులు చొరవ చూపాలని ఎమ్మెల్యే కోరారు. రాజులకండ్రిగ నుంచి పూడి సీకే పురం వెళ్లే మార్గమద్యంలో ఉన్న ఏరు వర్షానికి కొట్టుకుపోవడంతో ఎమ్మెల్యే పరిశీలించారు. సంబంధించిన ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులతో మాట్లాడుతూ తక్షణం ఈ రోడ్డును వెంటనే మరమ్మతులు చేసి పూడి, సీకే పురం ఎగువ పూడి, దిగువ పూడి తదితర గ్రామ పంచాయతీ ప్రజలకు ప్రయాణ రాకపోకలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. వర్షాకాలం వస్తే ఈ ఏరు ప్రభావంతో ప్రయాణివంచడానికి రోడ్డు కొట్టుకుపోతుందని పలు మార్లు సంబంధించిన అధికారులకు తెలియజేసినా టెండర్లు వచ్చినా టెండర్లు ఎవరు దానిని పట్టించుకోలేదని దీనిపైన ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి వెంటనే వంతెన నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని ఆయన ఎంపీడీవో రోజారాణికు సూచించారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి గోవిందస్వామి, పాలమంగళం రమేష్ ఉన్నారు.

## నష్టం అపారం: ఆదుకుంటుంది ప్రభుత్వం



ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి,అక్టోబర్ 23 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆపార నష్టం వాటిల్లిందని ఈ నష్టాన్ని గుర్తించి ప్రభుత్వం ఆదుకుంటుందని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని రేణిగుంట,ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాల్లో వరద ముప్పు ప్రాంతాలను పరిశీలించామన్నారు. గతంలో పరిపాలించిన వైకాపా పాలన ఐదేళ్లలో చెరువుల పేరుతో పాలకులు జేబులు నింపుకున్నారని దాంతో చెరువుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. వాటి మరమ్మత్తులు,అధునీకరణకు సబంధించి మంత్రితో మాట్లాడానన్నారు. నియోజకవర్గంలో నష్టాలకు సంబంధించి దుబాయ్‌పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న యువ నాయకుడు నారాలోకేష్ దృష్టికి తెచ్చినట్లు వివరించారు.గత పాలకుల పాపం నేడు ప్రజలకుశాపంగా మారిందన్నారు. ఐదేళ్ళు పరిపాలించిన పాలకులు రాజీవ్‌నగర్‌లో ప్లాట్లను అమ్ముకున్నారు తప్ప అక్కడ సదుపాయాల కల్పనను పట్టించుకోలేదన్నారు.దాంతో నేడు ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది రుతుపవనాల వానలతో పాటు అల్పపీడనంతో భారీ వర్షాలు కురుస్తున్నాయన్నారు. శ్రీకాళహస్తి-తిరుపతి మార్గంలోని శ్రీకాళహస్తి,ఏర్పేడు,రేణిగుంట ప్రాంతాల్లోకొన్ని చోట్ల పంటపొల్లాలో నీరు చేరిందన్నారు. అంతేకాక కొందరు ముందస్తు బోర్లు నీటి స దుపాయం ఉన్న వారు నార్లు పోసుకున్నారని అవి కుళ్ళి పోయే ప్రమాదం ఉందన్నారు.అంతేకాక తన పర్యటనలో అక్కడక్కడా చెరువులకు నష్టం వాటిల్లినట్లు గుర్తించామన్నారు. ఇరిగేషన్ అధికారులు నష్టాన్ని అంచనా వేయాలన్నారు. తాత్కాలికంగా వచ్చిన నీటిని బయటకు పోకకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు.

**రహదారులపై దృష్టి:** శ్రీకాళహస్తి పట్టణంలో గ్రామాలకు ఎంతో సంబంధం ఉందని అయితే కొన్ని కాలువలు వర్షాకాలం ఇబ్బంది కల్గిస్తున్నాయని ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. తన తండ్రి గోపాలకృష్ణారెడ్డి ఆర్‌అండ్‌బి మంత్రిగా ఉన్నపుడు పలు మార్గాలను ఆర్‌అండ్‌బిలో కలిపారని అందులో కొన్ని చోట్ల లో లెవల్ కాజ్‌వేలు ఉన్నాయని వాటి ఎత్తు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.అందులో భాగంగా సున్నపు కాలువ,ఉడమల పాడు వద్ద కాలువ, ఇక సువర్ణముఖిపై మోదుగుల పాళెం వద్ద హైలెవల్ కాజ్‌వే నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ మేరకు అంచనాలు తయారు చేయాలని సంబంధిత అధికారులను సూచించినట్లు ఎంఎల్ఏ వివరించారు.

## ఆకట్టుకుంటున్న నృత్యోత్సవాలు

శ్రీకాళహస్తి,అక్టోబర్ 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం సందర్భంగా నటరాజ మండపంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో కళాకారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో తిరుపతికి చెందిన వినూత్న ఆకాడమి అండ్ ఆర్ట్స్ వారు ప్రదర్శించిన 'శివపార్వతుల నృత్యోత్సవం, స్వామి రారా నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టు కుంది.ఈ కార్యక్రమాలను నిర్వహించిన ఆకాడమి వారికి కళాకారులకు ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి దంపతులు ఆశీర్వదించి దేవస్థానం తరపున మెమెం టోలను అందించారు.నిర్వాహాకులు తిరుపతికి చెందిన పిఆర్ భానుకుమార్, శ్రీకాళహస్తికి చెందిన ఎంఎస్ ఆషాలు పాల్గొన్నారు.

## గరుడవారధిపై సూచికలు ఏర్పాటుచేయాలి

### -కమిషనర్ మౌర్య ఆదేశం



తిరుపతి,అక్టోబర్ 23ప్రభాతవార్త: తిరుపతినగరంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా గరుడారధిపై ప్రమాదాలు జరగకుండా సూచికబోర్డులు ఏర్పాటుచేయాలని నగరపాలక కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. వారధిపై డివైడర్లు, కూడళ్ళలో పచ్చదనం కోసం మొక్కలు నాటాలని సూచించారు. గరుడవారధిపైప్రమాదాల నివారణలో భాగంగా తీసుకోవాల్సిన చర్యలు, డిసెంబర్‌నెలాఖరులోపు సిసికెమెరాలు ఏర్పాటు పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.

## దుస్థితిలో నచ్చుకూరు అమ్మ చెరువు మొరవ

### – పట్టించుకోని అధికారులు



**వెదురుకుప్పం, అక్టోబర్ 23 ప్రభాతవార్త :** మండలంలోని జక్కదొన పంచాయితీ పరిధిలోని నచ్చుకూరు గ్రామ సమీపంలోగల అమ్మ చెరువు మొరవ దుస్థితికి చేరకుని ప్రమాద పరిస్థితి ఏర్పడిన అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి ... ఇటీవల వరుస తుఫానులు, అల్పపీడనం ప్రభావంతో మండలంలో అధిక శాతం వర్షపాతం నమోదు కావడంతో మండలంలోని అధిక శాతం చెరువులు పూర్తి స్థాయిలో నిండటంతో రైతులు ఆనందోత్సవాలతో ఉన్నారు. పంటల సాగుకు అవసరమైన సాగునీటికి ఇబ్బందులు పడవలసిన పనిలేదని సంతోషంగా ఉన్నారు. కాగా అమ్మ చెరువు మొరవ దుస్థితికి చెరుకుని కొట్టుకుపోయే ప్రమాదం ఉందన్నారు. మొరవ కొట్టుకుపోతే చెరువులోని నీరు వృధాగా పోవడంతో పాటు ఆకట్టు ప్రాంతంలోని వ్యవసాయ భూములు నీటమునిగి అస్థవ్యస్థంగా మారుతుందని వాపోయారు. మొరవ దుస్థితికి చెరుకుని రంధ్రం పడటం వలన మొరవ ప్రవాహ నీరు రంధ్రం గూండ వెళ్ళడం వలన ప్రమాద పరిస్థితి ఏర్పడిందన్నారు. వర్షాల కారణంగా చెరువుల పరిస్థితిని ఎప్పటికప్పుడు మండల స్థాయి అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు జారీ చేసి చర్యలు తీసుకోలేదని స్థానికులు చెబుతున్నారు. ఇకనైన జిల్లా స్థాయి అధికారులు స్పందించి దుస్థితిలోని మొరవ గండికి మరమ్మత్తులు చేయించాలని కోరుతున్నారు.

## సంతకాలు సేకరించిన పత్రాలు షర్మిలకు అందజేసిన రమేష్

వెదరుకుప్పం, అక్టోబర్ 23 ప్రభాతవార్త :



ఓటు చోడ్ గద్దీ చోడ్ కార్యక్రమంలో భాగంగా గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో సేకరించిన సంతకాల పత్రాలను నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జీ రమేష్ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు అందజేశారు. జాతీయ కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపు మేరకు ఓటు చోడ్ గద్దీ చోడ్ కార్యక్రమంలో భాగంగా గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో ప్రజల నుంచి సేకరించిన పత్రాలను విజవాడలో గురువారం షర్మిలమ్మను కలిసి అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోటుగారి భాస్కర్ పాల్గొన్నారు.

## తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షం

కుప్పం,అక్టోబర్ 23ప్రభాతవార్త

బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫానుప్రభావంతో కుప్పం నియోజకవర్గంలో గురువారం సైతం మోస్తరు వర్షం కురుస్తోంది. మధ్యాహ్నం కొంత తెరపి ఇచ్చిన వర్షం సాయంత్రం నుంచి మొదలై బాగా పొద్దుపోయేదాకా కురుస్తూనే ఉంది. వర్షం దెబ్బకు రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. కుప్పం ప్రాంతంలో భారీ వర్షం లేకపోవడంతో రైతులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## ప్రజలనుంచి జిల్లా కలెక్టర్ వినతుల స్వీకరణ

శాంతిపురం,అక్టోబర్ 23 ప్రభాతవార్త



జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గురువారం శాంతిపురంలో పర్యటించారు. స్థానిక మండల కార్యాలయంలో అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష జరిపారు. అనంతరం ప్రజలనుంచి వినతులు సీ ్వకరించారు. కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించి మరికొన్నింటిని తహశీల్దార్, ఆర్డీఓలకు తగుచర్యల నిమిత్తం ఆదేశించారు. ఓ దివ్యాంగుడు తనకు వైకల్యం తక్కువ శాతం ఉందని సదరం సర్టిఫికెట్‌లో రావడంతో పెన్షన్ రావడం లేదని పేర్కొనగా కొంత సాయం అందిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులురాజు, తహశీల్దార్ శివయ్య పాల్గొన్నారు.

## పక్కాఇళ్ల మంజూరుకు గ్రామాల్లో సర్వే

శాంతిపురం, అక్టోబర్ 23 ప్రభాతవార్త

ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పిఎంఎవై)కింద కొత్తగా పక్కా ఇళ్ల మంజూరుకు గ్రామాల్లో రేపటినుంచి సర్వే చేపట్టనున్నట్లు ఎంపిడిఓ పిఆర్ కుమార్ తెలిపారు. సొంత ఇంటి స్థలం కలిగి ఇళ్లు లేని బిపిఎల్ కుటుంబాలు ఈ పథకంలో అర్హులన్నారు. ఇందుకుగాను పొజిషన్‌సర్టిఫికెట్ కలిగి ఉండాలని గ్రామాల్లో అందుబాటులో ఉ ండి అర్హులు సర్వే సిబ్బందికి తమ వివరాలు అందించి సహకరించాలన్నారు. ఇదివరకే ప్రభుత్వ పథకాల్లో ఇళ్లుమంజూరైన వారు, సొంత ఇళ్లు కలిగిన వారు అనర్హులన్నారు.

## ఆలయాల నిర్మాణంకు ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల విరాళం

శాంతిపురం,అక్టోబర్ 23 ప్రభాతవార్త



మండలంలోని చిన్నారిదొడ్డి పంచాయతీ కొండ తిమ్మనపల్లిగ్రామంలో తెదేపా కార్యకర్త శంకరప్ప నూతనంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి, ఇతర దేవతల ఆలయాలను నిర్మిస్తున్నారు. ఆలయాల నిర్మాణంకు ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ తన వంతుగా గురువారం స్థానిక కుప్పం పార్టీ కార్యాలయంలో లక్ష రూపాయల విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్ కుమార్,నేతలు విశ్వనాథనాయుడు, మణి,చంద్ర, నాగరాజు, బాలు, చంద్రకళ, లోకి పాల్గొన్నారు.

## కొత్తపేటలో దొంగలు హల్‌చల్

### నగదు, బంగారు, సెల్‌ఫోన్లు చోరీ

కల్లూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త

పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి (కొత్తపేట)లో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. కొత్తపేటలో డ్రైవర్ అబ్దుల్ బంధువుల ఇంటికి వెళ్లారు. ఈ సమయంలో దొంగలు అబ్దుల్ ఇంట్లో బంగారు, నగదు ఎత్తుకెళ్లారు. ఎల్రక్టానిక్ వ్యాపారి పృథ్వీరాజ్ దుకాణంలో సెల్ ఫోన్లు చోరీకి గురి అయ్యాయి. సమాచారం అందుకున్న కల్లూరు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

## వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా పక్కా చర్యలు

### - మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ ఆదేశం



**చిత్తూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త:** చిత్తూరు నగర పరిధిలో కురుస్తున్న వర్షాలతో ప్రజలు ఎవ్వరు ఇబ్బందులు పడకుండా పక్కా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ గురువారం సంతపేట లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీటి తాజా పరిస్థితిని పరిశీలించారు. సంతపేటలో వర్షపు నీరు రోడ్డుమీదికి రాకుండా మళ్ళించడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు కమీషనర్ దిశా నిర్దేశం చేశారు. అలాగే వర్షపు నీటిని తాత్కాలికంగా మళ్ళించడానికి బుధవారం ఏర్పాటు చేసిన కల్వర్టును కమీషనర్ పరిశీలించారు.

## 150 కేజీల ప్లాస్టిక్ కవర్లు సీజ్

చిత్తూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త:



చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గిరింపేటలో ఓ ప్లాస్టిక్ కవర్ల నిల్వ గోడౌన్‌పై మున్సిపల్ అధికారులు గురువారం దాడి చేసి 150 కేజీల ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేశారు. మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ ఆదేశాలతో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్ ఆధ్వర్యంలో ప్రజారోగ్య విభాగం అధికారులు సిబ్బందితో కలిసి గిరింపేట పగడమాను వీధిలోని ప్లాస్టిక్ కవర్ల గోడౌన్‌పై దాడులు చేసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అధికారులు 150 కేజీల సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్‌ను గుర్తించి సీజ్ చేశారు. అలాగే గోడౌన్ యాజమానికి రూ.5 వేలు జరిమామా విధించారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, కార్యదర్శులు, మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

## పిఎఫ్ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

### - జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు



**చిత్తూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త:** జడ్పీ పిఎఫ్ సమస్యలను సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు పేర్కొన్నారు. రాష్ట్ర ఎస్టీయు అసోసియేట్ అధ్యక్షులు గంటామోహన్ ఆధ్వర్యంలో గురువారం ఎస్టీయు నాయకులు జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడును జడ్పీ పిఎఫ్ సమస్యలపై కలిసి చర్చించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీయు నాయకులు మాట్లాడుతూ పదవీ విరమణ చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు నెలలు గడుస్తున్నప్పటికీ తమ పిఎఫ్ ఖాతాల నుండి తుది మొత్తాలను పొందలేకపోతున్నారని, దశాబ్దాల తరబడి సేవ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు తమ జీతాల నుండి పొదుపు చేసుకున్న పిఎఫ్ మొత్తాల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయడం దురదృష్టకరమన్నారు. పిఎఫ్ మిస్సింగ్ క్రెడిట్స్ క్రమబద్ధీకరణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు మాట్లాడుతూ రిటైర్డ్ అయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక ప్రయోజనాలను వీలైనంత త్వరగా అందించడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయు నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, లక్ష్మీపతి, అమరనాథ్‌రెడ్డి, గుణశేఖర్, బాలచంద్రారెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## నూతన వధువుకు తాళిబొట్టు మెట్లు వితరణ

చౌడేపల్లి, అక్టోబర్ 23 ప్రభాతవార్త



నూతన వధువుకు తాళిబొట్టు, కాలి మెట్లను బహూకరించారు. మండలంలోని ఎ.కొత్తకోట పంచాయతీ అగ్రహారంకు చెందిన చంద్ర కుమార్తె నూతన వధువు శ్రావణికి అదే గ్రామానికి చెందిన పురోహితుడు ఆనందాచార్యులు ఆయన సతీమణి చాముండేశ్వరీలు రూ. 15వేలు విలువ చేయు తాళిబొట్టు, కాలి మెట్లతోపాటు నూతన వస్త్రాలను బహూకరించారు. ఈమేరకు పుంగనూరు రూరల్ సిఐ రాంభూపాల్ చేతుల మీదుగా అందించారు. దాత, వధువు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సాయిబాబా ఆలయంలో గురువారం పూజలు



చౌడేపల్లి, అక్టోబర్ 23 ప్రభాతవార్త

స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలలో గురువారం విశేష పూజలు జరిగాయి. ప్రధానార్చకుడు పృద్వీనవీన్ ఆధ్వర్యంలో ఉదయాన్నే స్వామివారికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో కాగడా హారతులతో ఆలయం దద్దరిల్లింది. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## వైద్య సదుపాయాలు కల్పించాలి

పూతలపట్టు, అక్టోబర్ 23, ప్రభాతవార్త



మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పూతలపట్టులో వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో రివ్యూ మీటింగ్ గురువారం నిర్వహించారు. ఈ సమావేశంకు జిల్లా స్టాటిస్టికల్ అధికారి జార్జి హాజరై ఫీల్డ్ సిబ్బందిని సచివాలయం వారిగా రివ్యూ చేసి ఇచ్చిన ఫోరఫార్మెన్స్ అన్ని తక్కువ ఎవరు వున్నారు ఎందుకు వున్నారు అని విచారించారు. గర్భవతులను తొందరగా గుర్తించి వారికి సకాలంలో టీకాలు వేసి ఆసుపత్రికి కాన్పులు చేయించాలని తెలిపారు. ఎలిజిబుల్ కపుల్స్‌కు అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఎస్ఓ ఉమాపతి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, ఎంపిహెచ్ఈఓ నరసింహప్రసాద్, హెల్త్ సూపెర్వైజర్ లు నూర్జహాన్, దర్మేంద, ఎంఎల్‌హెచ్‌పిఎస్ ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్టేట్ జనరల్ సెక్రటరీగా చంద్రమౌళి ఎన్నిక

పూతలపట్టు, అక్టోబర్ 23, ప్రభాతవార్త



పూతలపట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న జి చంద్రమౌళి ఇంటర్మీ డియట్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ స్టేట్ జనరల్ సెక్రెటరీగా ఎన్నికవ్వడం జరిగింది. గురువారం కళాశాలలో ఘనంగా ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా పూతలపట్టు కళాశాల ప్రిన్సిపాల్ వి.రమేష్, జూనియర్ అసిస్టెంట్, విజయ్‌కుమార్, అధ్యాపకులు కె. సతీష్ కుమార్, జివి సత్యనా రాయణ, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## పాటూరుకి రానున్న సినీ నటుడు అజయ్

పూతలపట్టు, అక్టోబర్ 23, ప్రభాతవార్త

మండలంలోని పాటూరు పంచాయతీలో జయచంద్ర నాయుడు ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ శుక్రవారం ఉదయం 9:30 నుంచి 10 గంటల మధ్య పాటూరు కాలభైరవ స్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలలో సినీ నటుడు అజయ్ పాల్గొననున్నారు.

## తెగిన కల్వర్టుకు మరమ్మతులు చేయాలంటూ జనసేన వినతి

సోమల అక్టోబర్ 23 (ప్రభాతవార్త)



ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు సోమల పెద్ద ఉప్పరపల్లి మార్గంలో సరస్వతీపురం వద్ద కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో 60 గ్రామాల ప్రజలు రహదారి మార్గం లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రులకు వచ్చే రోజులు కళాశాలలకు పోయే విద్యార్థులు వేరే మార్గం లేక ఇండ్లకే పర మార్థం అవుతున్నారు. కల్వర్టు తాత్కాలిక పునరుద్ధరణకు నిధులు మంజూరు చేయాలంటూ జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నాగభూషణం రాయల్ ఆధ్వర్యంలో ఎంపీడీవో ప్రసాద్‌కు గురువారం మధ్యాహ్నం వినతిపత్రం సమర్పించారు. రహదారి మార్గం లేకపోవడంతో గురువారం నంజంపేటలో జరిగే వారపు సంత అటు వ్యాపారులు ఇటు కొనుగోలుదారులు లేక వెల వెల పోయింది. అధికారుల స్పందించి వెంటనే మరబతులు చేయాలని ప్రజలు జనసేన పార్టీ నాయకులు అధికారులకు వినతించారు

## బయోమెట్రిక్ వివరాలు నమోదు చేయాలి

కల్లూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త



విద్యార్థులకు ఆధార్ రికార్డుల్లోని బయోమెట్రిక్ వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని ఎంపీడీవో రాజశేఖర్ బాబు అన్నారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మాండటరీ బయోమెట్రిక్ అప్డేట్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రాజశేఖర్ బాబు మాట్లాడుతూ బిఎంయు విధానంపై ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నామని ఈ క్యాంపులు ఈనెల 30వ తేదీ వరకు ఉంటాయని అందరూ విద్యార్థుల వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని అన్నారు. అనంతరం ఎంబియు విధానంపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సిద్ధరామయ్య, పోకల తాతయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## బాలికల భద్రతకు భరోసా కల్పించండి



రాష్ట్ర టిడిపి మహిళా ఉపాధ్యక్షురాలు వైవి రాజేశ్వరి

చిత్తూరురూరల్, అక్టోబరు 23 ప్రభాతవార్త:

పాఠశాలలు, కళాశాలలలో చదువుతున్న బాలికల భద్రతకు భరోసా కల్పించాలని రాష్ట్ర టిడిపి మహిళా ఉపాధ్యక్షురాలు వైవి రాజేశ్వరి గురువారం జిల్లా ఎస్పీ తుషార్ దూడిని కలసి వినతి చేసారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణకు ఆపద సమయంలో శక్తి యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందనీ, అలాగే మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్‌మోసాలపై టోల్‌ఫ్రీం నెం.1930కు, సంబంధిత పోలీసువారికి వెంటనే తెలియజేయాలని సూచించారు.

## ఎక్సైజ్‌కేసులో ముద్దాయికి రిమాండ్

చౌడేపల్లి, అక్టోబర్ 23 ప్రభాతవార్త



ఎక్సైజ్ కేసులో ముద్దాయిని రిమాం డ్‌కు తరలిం చినట్లు ఎస్ఐ నాగేశ్వర రావు తెలిపారు. ఆయన కథనం మేరకు మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ కేతనపల్లిలో ఏప్రిల్ 4 2025న నాటు సారా విక్రయాలు జరు గుతున్నట్లు సమాచారమొచ్చింది. వెంటనే వెళ్ళి గ్రామంలో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో అదే గ్రామానికి చెందిన నాగజ్యోతి, శివకుమార్ దంపతులు ఇంటి ముందు నాటుసారా విక్రస్తున్నారు. వారిని అదుపులోకి తీసుకొని 5లీటర్ల నాటుసారాను స్వాధీన పరచుకొన్నారు. ఆ కేసులో శివకుమార్ పరారీ అయ్యాడు. గురువారం నిందితుడు శివకుమార్ దుర్గసముద్రం బస్‌స్టాఫ్ వద్ద వున్నట్లుగా సమాచారమందడంతో పిఎస్ఐ మణికంఠేశ్వరరెడ్డి సిబ్బంది వెళ్ళి నిందితున్ని అదుపులోకి తీసుకొన్నారు. అతన్ని పుంగనూరు కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.

## స్వర్ణముఖికి పెరుగుతున్న వరద

శ్రీకాళహస్తి,అక్టోబర్ 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నుంచి ప్రవహించే జీవనది సువర్ణముఖి నదిలో గురువారం రాత్రి వరద పెరిగింది. ఈ నదిలోకి మల్లెమడుగులోని లాగులు ఓపెన్ చేయటంతో సువర్ణముఖి నదిలో వరద స్థాయి పెరుగుతుంది.ఇరిగేషన్ అధికారులు అందించిన సమాచారం మేరకు నదిలో సుమారు 8వేల క్యూసెక్కుల వరద ప్రవహిస్తుందని వివరించారు. వచ్చిన నీటిని వృదా చేయకుండా సద్వినియోగం చేయటానికి ప్రయత్నిస్తున్నట్లు ఇరిగేషన్ అధికారి ఒకరు తెలిపారు. అయితే చెంబేడు కాలువ ద్వారా 34 చెరువులకు సాగునీరు అందించటం జరుగుతుందని ఇక్కడ అధికారికంగా 10,400 ఎకరాలకు సాగునీరందిస్తున్నట్లు తెలిపారు.ప్రస్తుతం స్వర్ణముఖి నది నిండా నీరు ప్రవహిస్తున్నా ఈ సిస్టం కింద చెరువుల్లో నీరు నిండుగా ఉండటంతో నదిలో వచ్చే నీరు అంతా శ్రీకాళహస్తి నుంచి నదిలోకే మళ్ళించినట్లు వివరించారు.పరివాహక ప్రాంత ప్రజలు ప్రవాహం పెరుగుతుంది కాబట్టి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## తృటిలో తప్పిన పెను ప్రమాదం



పెళ్లకూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త : పూతలపట్టు -నాయుడుపేట జాతీయ రహదారిపై పెన్నేపల్లి గ్రామ సమీపాన నెల్లూరు నుండి బెంగళూరుకు వెళుతున్న లక్కీ ట్రావెల్స్ ప్రైవేటు సంస్థకు చెందిన బస్సు క్షణాల్లో మంటలు చెలరేగి అగ్నికి ఆహుతి అయ్యింది. బస్సులోని ప్రయాణికులు చెప్పిన వివరాల ప్రకారం బెంగళూరులో ఒక వివాహ శుభకార్యానికి అని నెల్లూరు నుండి గురువారం ఉదయం లక్కీ ట్రావెల్స్ చెందిన ప్రైవేట్ బస్సులో బయలుదేరారు. బస్సు పెళ్లకూరు మండలంలోని పెన్నేపల్లి గ్రామ సమీపానికి రావడంతో బస్సులో ఏదో సాంకేతిక సమస్య ఏర్పడిందని బస్సు సిబ్బంది చెక్ చేస్తుండగానే ప్రమాదవశాత్తు ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇది గమనించిన బస్సులోని ప్రయాణికులు ఒక్కసారిగా బస్సులో ఉన్న అత్యవసర ద్వారం గుండా బయటపడ్డారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటా హుటిన ప్రమాద స్థలానికి బస్సులోని మంటలను అదుపు చేశారు. ప్రమాదవశాత్తు జరిగిన ఈ సంఘటనలో బస్సులోని ప్రయాణికులు అందరూ క్షేమంగా బయటపడడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాద విషయాన్ని తెలుసుకున్న వెంటనే నాయుడుపేట డిఎస్పి చెంచు బాబు పెళ్లకూరు తహశీల్దార్ సిహెచ్ హరికృష్ణ ఎస్సై నాగరాజు ఘటనా స్థలానికి చేరుకుని ప్రయాణికులను పరామర్శించి వాహన రాకపోకలకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా చేశారు.

# గూడూరు డివిజన్

## అందరి ఆమోదంతో శ్రీకృష్ణ దేవస్థానం నిర్మాణం



సూళ్లూరుపేట, అక్టోబర్ 23 ప్రభాతవార్త: పట్టణంలోని రాఘవయ్యపేటలో నూతనంగా నిర్మించ తలపెట్టిన శ్రీకృష్ణ దేవస్థానాన్ని అందరి ఆమోదంతో సర్వాంగ సుందరంగా నిర్మించుకోవాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగా ప్రసాద్ సూచించారు. గురువారం ప్రస్తుతం తాత్కాలికంగా నిర్మించి ఉన్న దేవస్థానం స్థలాన్ని వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఈ స్థలం విషయంలో నెలకొని ఉన్న వివాదాన్ని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అందులో భాగంగా తహశీల్దార్, కమిషనర్, సర్వేయర్లను తీసుకొచ్చి పక్కాగా కొలతలు వేసి దేవస్థానం నిర్మాణానికి అనువుగా ఉండే స్థలాన్ని మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, పెంచలకోన దేవస్థానం ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ తానంకి నానాజీ, ఎఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎఫ్‌పిఎస్ ఛైర్మన్ ఎజి కిషోర్, పూడి సెల్వం, బొమ్మన పళణి, దువ్వూరు మురళీరెడ్డి, రవి, ఆలీభాయ్, దామురాయల్ తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థకు చేరిన గూడూరు ఆర్టీసీ బస్టాండ్




గూడూరు, అక్టోబర్ 23, ప్రభాతవార్త: గూడూరు ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరింది. బస్టాండ్‌పై కప్పు పెచ్చు లూడి పడుతోంది. దీంతో బస్టాండ్ ఆవరణలో ప్రయాణీకులు అనుక్షణం భయం... భయంతో వున్నారు. అసలు బస్టాండ్ అధ్వాన్న స్థితిపై అధికారులకు ఎందుకు కనబడడం లేదని ప్రయాణీకులు ప్రశ్నిస్తూ వున్నారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నత స్థాయి ప్రభుత్వ అధికారులు బస్సు ప్రయాణం చేయరు గనుక బస్టాండ్ శిథిలావస్థ స్థితిలోవున్న పట్టించుకోరా? అని వాపోతున్నారు. గూడూరు బస్టాండ్ శిథిలావస్థకు చేరి స్లాబ్ పెచ్చులు ఊడిపడి నెత్తి ఎక్కడ పగులుతుందో అని ప్రయాణీకులు భయం భయంగా బస్టాండ్ బయటే బస్సు కోసం వేచి ఉంటు న్నారు. బతుకు జీవన పోరాటంలో అనేక మంది ప్రయాణికులు ఈ బస్టాండ్ నుండి ప్రయాణిస్తూ ఉంటారు. కానీ బస్టాండ్‌లో స్లాబ్ పెచ్చులు ఊడిపడి అసలు బ్రతికే లేకుండా పోతుందేమో అని భయపడుతున్నారు. అనునిత్యం గూడూరు బస్టాండ్‌కి వందల సంఖ్యలో బస్సులు, వేల సంఖ్యలో ప్రయాణికులు వస్తూ ఉంటారు. ఏ క్షణం ఏ ప్రమాదం జరుగుతుందో అర్థం కాని అయోమయ స్థితిలో గూడూరు పరిసర ప్రాంత ప్రజలు వున్నారు. ఇకనైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి బస్టాండ్ బాగు చేస్తారో? లేదా గాలికి వదిలేస్తారో వేచి చూద్దాం.

## అరకొరగా... పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ!



దక్కిలి, అక్టోబరు 23 ప్రభాతవార్త : మండలంలో అరకొరగా పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేసి వ్యవసాయశాఖ అధికారులు చేతులు దులుపుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు సరఫరా చేసిన విత్తనాలు ఏమూలకు చాలవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు అవసరమైన విత్తనాల్లో 20 శాతం కూడా సరఫరా చేయలేదని వారు చెబుతున్నారు. ప్రతి ఏటా రైతులకు అవసరమైన జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు వ్యవసాయశాఖ సరఫరా చేస్తోంది. అయితే ఈఏడాది అధికారులు రైతులకు జీలుగ విత్తనాలు మాత్రమే సరఫరా చేసిందని వారు తెలిపారు. విత్తనాలు చాలవని వ్యవసాయశాఖ అధికారులు ఇటీవల గుట్టుచప్పుడు కాకుండా సిఫార్సులు చేసిన వారికి మాత్రమే ఇచ్చారని రైతులు చెబుతున్నారు. వాస్తవానికి రబీ సీజన్‌లో దక్కిలి మండలంలో చెరువులు, బోరుబావులు, ఏర్లు కింద సమారు 50 వేల ఎకరాలకు పైగా రైతులు వరి పంటను సాగు చేస్తారు. ఖరీఫ్‌లో అయితే 25 వేల ఎకరాలకు పైగా సాగు చేస్తారు. రెండు సీజన్లల్లో వరిపంటలు సాగు చేయడం వల్ల భూముల్లో పంటలకు అవసరమైన పోషకాలు కొరత ఏర్పడుతుంది. పచ్చిరొట్టవిత్తనాలు సాగుచేసి వరి పంట సాగు చేస్తే అధిక దిగబడులు వస్తాయి. అయితే ఈసీజన్‌లో పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా అరకొరగా ఉండడం వల్ల ఆవిత్తనాలు కోసం ప్రవేటు దుకాణాలను ఆశ్రయించక తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక రబీ సీజన్ ప్రారంభం అవుతున్నా రైతులకు వరి విత్తనాలు సరఫరా ఊసే లేకపోవడంతో వరి విత్తనాలు కోసం కూడా ప్రవేటు వ్యాపారస్తులను ఆశ్రయించాల్సి వస్తుందోమేనని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు, వరి విత్తనాలు సరఫరా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది

## సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ 3లక్షలు



కోట, అక్టోబర్ 23 ప్రభాతవార్త: కోట మండలం కొత్తపట్నం పంచాయతీలోని పెద్ద గొవిందపల్లికి గ్రామానికి చెందిన కాల్తిరెడ్డి సుభాషిణికి ముఖ్యమంత్రి సహయ నిధి నుంచి రూ 3లక్షల రూపాయాలను స్దానిక శాసనసభ్యులు డాక్టర్, పాశం సునిల్ కుమార్ అందచేశారని గూడూరు నియోజకవర్గం ఎస్‌సి సెల్ అధ్యక్షులు చెంగల్‌రావు చెప్పారు. ఆమేరకు బాధితరాలు తిరుపతిలోని సిమ్స్‌లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఆమేరకు గురువారం ఎమ్మెల్యే చెక్కును అందచేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికి 16 నెలల కాలంలో నియోజకవర్గంలో కోట్లాదిరూపాయాలతో అభివృద్ధి పనులు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. జనవరిలో జరగబోవు పంచాయతీ ఎన్నికల్లో కూడా 100శాతం పంచాయతీలను కూటమి ప్రభుత్వం సొంతం చేసుకుంటుందన్నారు.

## ముద్దాయికి మూడేళ్లు జైలు శిక్ష!

గూడూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త: గూడూరు 2 టౌన్ పరిధిలోని 2022 ఫిబ్రవరి 2వ తేది జిఎస్ఆర్ఎం హైస్కూల్ వద్ద బాలికను నిందితుడు ప్రేమించాలని అడ్డగించి వేధించడం, గాయపరచడం, బెదిరించడం వంటి చర్యలకు పాల్పడాడు. దీంతో బాలిక మానసికంగా కృంగిపోయి తన చేతికి గాయపర్చుకుంది. స్కూల్ సిబ్బంది వెంటనే స్పందించి బాలికను ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై అప్పటి 2 టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ జె. తిరుపతయ్య కేసు నమోదు చేసి, సమగ్ర దర్యాప్తు జరిపి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టు విచారణ సమయంలో ప్రస్తుతం 2 టౌన్ సీఐ జె. శ్రీనివాస్, గూడూరు డీఎస్పీ ఆదేశాల మేరకు సాక్షులను స్వయంగా హాజరుచేసి, కోర్టు లైజన్ ఆఫీసర్ ఏఎస్ఐ బాదుషా, కోర్టు కానిస్టేబుల్ ప్రదీప్ సహకారంతో విచారణను సమర్థవంతంగా పూర్తి చేశారు. ముద్దాయికి మూడేళ్ళు జైలు శిక్ష ఖరారు చేసినట్లు తెలిపారు. అలాగే బాధిత బాలికకు న్యాయం జరిగేలా కృషి చేసిన గూడూరు పోలీస్ బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు.

## అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

దక్కిలి, అక్టోబరు 23 ప్రభాతవార్త: దక్కిలి మండలంలో కురుస్తున్న వర్షాలకు పంచాయతీల్లోని కార్యదర్శిలు, సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాజిదర్లు అప్రమత్తంగా విధుల నిర్వహించాలని దక్కిలి ఎంపీడీవో రవీంద్రబాబు తెలిపారు. మండంలోని పలు గ్రామాల్లో గురువారం పర్యటించారు. ఆయన పంచాయితీ కార్యదర్శిలు, సచివాలయ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. బంగాళఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా దక్కిలి మండలంలో భారీ వర్షాలు కురిస్తునాయని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జి డిప్యూటి ఎంపీడీవో నరసింహులు, పంచాయితీ కార్యదర్శి ఏడుకోండలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## పెన్నక్క చెరువుకు జలకళ

కోట, అక్టోబర్ 23 ప్రభాతవార్త: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత మూడురోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కోట మండలంలోని పలు చెరువులు జలకళ సంతరించుకున్నాయి. తిరుపతి జిల్లాలోని వరద ప్రవాహమంతా స్వర్ణముఖి, చల్లకాలువలకు చేరింది. చల్ల కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. చల్ల కాలువ నుంచి పెన్నక్క చెరువుకు వెళ్లే ర్యాంపు కాలువ మీదుగా పెన్నక్క చెరువులోకి నీటి ప్రవాహాన్ని మళ్లించారు. గూడూరు డివిజన్ పరిధిలో అతి పెద్ద చెరువు అయిన పెన్నక్క చెరువు ఆయకట్టు కింద 6 వేల ఎకరాలు పంటలు పండిస్తున్నారు. ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఎమ్మెల్యే విజయశ్రీకి...కొండేపాటి సన్మానం



సూళ్లూరుపేట, అక్టోబర్ 23 ప్రభాతవార్త: ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ గురువారం పట్టణంలోని ఆమె నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని ఆమెకు సూచించారు. అలాగే తెలుగుదేశం పార్టీ బలోపేతానికి అందరి సహకారం తీసుకుని పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెంచలకోన దేవస్థానం ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ తానంకి నానాజీ, ఎఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎఫ్‌పిఎస్ ఛైర్మన్ ఎజి కిషోర్, పూడి సెల్వం, బొమ్మన పళణి, దువ్వూరు మురళీరెడ్డి, రవి, ఆలీభాయ్, దామురాయల్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులోకి యూరియా



సూళ్లూరుపేట, అక్టోబర్ 23 ప్రభాతవార్త: రైతులకు అందుబాటులోకి యూరియా నిల్వలు సిద్ధంగా ఉన్నాయని డిఎఓ ఎస్.ప్రసాదరావు తెలిపారు. గురువారం ఆయన స్థానికంగా ఉన్న ఎరువుల దుకాణాలను ఎఫ్ఎస్‌సిఎస్ గోడౌన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు ఎంత మేరకు ఉన్నాయని రికార్డులు పరిశీలించారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదార్ పాస్‌పుస్తకం తీసుకొచ్చి రైతు సేవా కేంద్రాల వద్ద అందజేస్తే అక్కడ వారికి టోకెన్ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఓ కాంచన, వ్యవసాయశాఖ సిబ్బంది, ఎడిఎ ఎస్.ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భూమనపై కూటమి కుట్ర



శ్రీసిటీ (తడ), అక్టోబర్ 23 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్, ప్రతిపక్షం నిర్మూలన ధ్యేయంగా పాలన సాగిస్తుందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బోలింగాలుపాడు జయకుమార్‌రెడ్డి ఆరోపిం చారు. గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో నకిలీ మద్యం వ్యవస్థీకృతంగా నడుస్తోందని, చేసిన తప్పును అవతలి వాళ్ల మీదకు నెట్టేయడం చంద్రబాబుకి, ఆయన తనయుడు లోకేష్ అలవాటైన పనేనని దుయ్యపట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## సేవా సంఘ్ అవగాహన సదస్సు



గూడూరు, అక్టోబర్ 23 ప్రభాతవవార్త: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సత్తెనపల్లి బివైఎస్ఎస్ జాతీయ అధ్యక్షులు మద్ది శెట్టి శ్యామేలు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో ఎంఎస్ ఎంఈ ప్రమోషనల్ కౌన్సిల్ వైస్ ఛైర్మన్ శివనాగేశ్వరరావు గౌడ్‌కి సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెవైఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు నాలి మధుసూదన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## మోటర్‌ను బాగుచేసిన మున్సిపల్ సిబ్బంది



వెంకటగిరి, అక్టోబర్ 23 ప్రభాతవార్త : పట్టణంలోని 14 వార్డు బొగ్గులు మెట్టలో గత కొద్దిరోజుల నుండి చెడిపోయిన తాగునీటి విద్యుత్ మోటార్ను మున్సిపల్ అధికారులు ఎట్టకేలకు బాగు చేయించారు. 14వ వార్డు కౌన్సిలర్ మరియు వెంకటగిరి నియోజకవర్గ వైయస్ఆర్‌సిపి పార్టీ ఆర్.టి.ఐ. విభాగపు అధ్యక్షుడు ఆరి శంకరయ్య జోక్యం చేసుకోవడంతో విద్యుత్తు మోటరుకి మోక్షం కలిగింది. నీళ్ల మోటర్ సుమారుగా ఐదు రోజుల నుండి పని చేయక పోవడంతో వెంకటగిరి మునిసిపల్ కమిషనర్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఏఈకి ఫోన్ చేసి సమస్యను చెప్పిన వేంటనే, త్వరితగా గతిన స్పందించి మోటర్ బాగు చేయించినట్లు తెలిపారు.

## నేటి నుండి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

బాలాయపల్లి, అక్టోబర్ 23 ప్రభాతవార్త : ఈనెల 24వ నుండి 29వ తేదీ వరకు మండలంలోని పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ వివరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నారాయణ తెలిపారు. 24, 25 తేదీల్లో నిడిగల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో, 27,28 తేదీల్లో పిగిలం జడ్పీ ఉన్నత పాఠశాలలో, వెంగమాంబపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, 29,30 తేదీల్లో జయంపు ఉన్నత పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాల బాలాయపల్లి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## హీరో ప్రభాస్ జన్మదిన వేడుకలు

వాకాడు, అక్టోబర్ 23 ప్రభాతవార్త: ప్రముఖ సినీ హీరో ప్రభాస్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం వాకాడు అశోక పిల్లర్ సెంటర్ సర్కిల్లో వాకాడు ప్రభాస్ ఫ్యాన్స్ యూత్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. యూత్ నాయకులు సినీ హీరో ప్రభాస్ గురించి కొనియాడారు. ప్రజలకు ప్రభాస్ యూత్ ఫ్యాన్స్ లీడర్ ధన సాయి స్వీట్లు పంపిణీ చేశారు.

## కల్తీ మద్యం ఫార్ములా...తాడేపల్లి ప్యాలెస్‌లో తయారైంది

-ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్



పుత్తూరు, అక్టోబరు 23 ప్రభాతవార్త : అన్నమయ్య జిల్లా ములకలచెరువులో బయటపడిన కల్తీ మద్యం స్కామ్ ఫార్ములా తాడేపల్లి ప్యాలెస్‌లో తయారైందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ ఆరోపించారు. కూటమి ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతీయాలనే దురుద్దేశ్యంతో వైసిపి నాయకులు చేసిన కల్తీ మద్యం కుట్రలో వారే ఇరుక్కుపోయారని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్తీ మద్యం కేసులో ప్రధాన నిందితుడైన జనార్ధనరావు, వైసిపికి చెందిన మాజీ మంత్రి జోగి రమేష్ చిన్ననాటి స్నేహితులని తెలిపారు. అందువల్లే సెప్టెంబరు 24వ తేదీన ఆఫ్రికాకు వెళ్లేందుకు టిక్కెట్ బుక్ చేసుకున్న జనార్ధనరావును 23వ తేదీన మాజీ మంత్రి జోగి రమేష్ తన ఇంటికి పిలిపించుకుని పక్కా ప్రణాళిక రచించారన్నారు. ములకలచెరువులో కల్తీ మద్యం తయారీ కేంద్రం ఆచూకీని జోగి రమేష్ అనుచరుడు సురేష్ ఎక్సైజ్ అధికారులకు ఫోన్ చేసి చెప్పడంలో కుట్ర కోణం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. జగన్ పాలనలో జంగారెడ్డిగూడెంలో కల్తీ నాటు సారా తాగి 27 మంది పేదల ప్రాణాలు కోల్పోతే కనీసం పోస్టుమార్టం కూడా చేయలేదని తెలిపారు. నకిలీ మద్యానికి అధికారిక ముద్ర వేసి జె బ్రాండ్‌లతో నేర సామ్రాజ్యం నడిపి వేల కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడ్డారన్నారు. మద్యం కుంభకోణంలో డీకార్ట్ లాజిస్టిక్స్ ఖాతా నుంచి వైసిపి ఎంపి మిథున్‌రెడ్డి కుటుంబానికి చెందిన పిఎల్ఆర్ ప్రాజెక్ట్ ఖాతాలోకి 5కోట్లు జమ అయిన విషయం సిట్ విచారణలో బయటపడిందన్నారు. కల్తీ మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న... ఎన్నికల ముందు వైసిపి నుంచి టిడిపిలో చేరిన దాసరిపల్లి జయచంద్రారెడ్డి, కట్టా సురేంద్రనాయుడులను ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు టిడిపి నుంచి సస్పెండ్ చేసి తగిన విచారణ నిర్వహిస్తున్నారని తెలిపారు. జయచంద్రారెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేశారన్నారు. ఎవరో చేసిన తప్పును కూటమి ప్రభుత్వానికి అంటగట్టాలని వైసిపి ప్రయత్ని స్తోందన్నారు. రాష్ట్రంలో విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో మద్యం పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసి 13 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారని, ఏ స్థాయిలో కూడా మద్యం కల్తీ జరిగే ఆస్కారం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

## డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే భూమన విచారణ

-ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి ధ్వజం



వెంకటగిరి, అక్టోబర్ 23 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్‌లో డైవర్షన్ పాలిటిక్స్ నడుస్తున్నాయని, అందులో భాగంగానే తమ పార్టీ సీనియర్ నేత, టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని పోలీసులకు విచారణకు పిలిచారని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి విమర్శించారు. టీటీడీకి సంబంధించిన గోశాల గోవులు పెద్ద సంఖ్యలో మరణించడంపై వివరాలు బయట పెట్టారనే కారణంతో ఇవాళ భూమనను ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు విచారణకు పిలిచారని తెలిపారు. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. టీటీడీలో గోమాతల మరణాలపై భూమన ఆధారాలతో సహా బయటపెట్టారని ఆయన గుర్తు చేశారు. తప్పుల్ని సరిదిద్దుకోడానికి, వాస్తవాల్ని బయటపెట్టిన భూమనను విచారణ పేరుతో వేధించడం సబబు కాదని ఆయన తప్పు పట్టారు.

## జలాశయంగా మారిన వీధులు-ఇళ్ళల్లోకి చొరబడ్డ వరదనీరు



చౌడేపల్లి, అక్టోబర్ 23 ప్రభాతవార్త: చౌడేపల్లి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వరదనీరు పట్టణంలో ప్రవహించింది. ఒక్కసారిగా నీరంతా ఇళ్ళల్లోకి ప్రవేశం చడంతో ప్రజలు ఇళ్ళనుంచి పరుగులు తీశారు. గురువారం సాయంత్రం నుంచి పట్టణంలో కుండపోత వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ముఖ్యంగా గాంధీవీధి, బజారువీధి, మోటారు వీధి తదితర ప్రాంతాల్లో వరదనీరు పొంగి ప్రవహించడంతో వీధులన్నీ జలాశయాన్ని తలపించాయి. చౌడేపల్లి చరిత్రలో ఈ విధంగా వీధులందు వరదనీరు రాలేదని పెద్దలంటున్నారు. కాలువలు సక్రమంగా లేకపోవడం, ఎగువ ప్రాంతాల్లో దురాక్రమణలు వంటివి జరగడంతోనే వరదనీరు వీధులు, ఇళ్ళల్లోకి ప్రవేశించాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## తవణంపల్లెలో కుంభవృష్టి -స్థంభించిన జనజీవనం

తవణంపల్లె, అక్టోబర్ 23 ప్రభాతవార్త: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మండలంలో గురువారం మధ్యాహ్నం నుండి కుంభవృష్టిగా వర్షాలు కురుస్తున్నాయి. మధ్యాహ్నం నుండి ఎడతెరపి లేకుండా కుంభవృష్టిగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. అలాగే గురువారం మధ్యాహ్నం నుండి జనజీవనం పూర్తిగా స్థంభించి పోయింది. కురుస్తున్న భారీ వర్షాలకు ఇంటి నుండి కాలు తీసి బయట పెటడానికే సాహసించాల్సిన పరిస్థితి నెలకొంది. ఎక్కువ మంది ప్రజలు ఇళ్ళకే పరిమితమయ్యారు. అత్యవసర పనులు మీద వెళ్ళే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికే మండలంలో గత 15 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు, నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి.

## వర్షంతో రైతులకు తప్పని తిప్పలు





విజయపురం, అక్టోబరు 23 ప్రభాతవార్త: మండలంలో వర్షంతో రైతులకు తిప్పలు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలోని ఎల్ల సముద్రం ఎస్టీ కాలనీలో ఆక్రమణల వలన, వరద నీరు వెళ్ళడానికి కాలువలు పూడిపోవడంతో వర్షపునీరు ఇంటిలోకి వెళుతున్నాయని, అధికారులు పట్టించు కోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. వీధుల్లో వర్షపునీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాజేంద్ర పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. మండలంలోని ఇష్టకామేశపురం చెరువు మొర పారడం వలన వరదనీరు తిరుత్తణి-నాగలాపురం రోడ్డు మార్గమధ్యంలో గొల్లకండ్రిగ దళితవాడ వద్ద వరవ కాలువ పూడిపోవడంతో వర్షపునీరు పొలంలోనే నిండి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తూము ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొండల్లో లింగానికి ప్రకృతి అభిషేకం...

## పరవళ్లు తొక్కుతున్న స్వర్ణమ్మ



శ్రీకాళహస్తి/శ్రీకాళహస్తి రూరల్, అక్టోబర్ 23 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కైలాసగిరుల్లోని జలపాతాలు దుముకుతూ భక్తులను కనువిందు చేస్తున్నాయి. కొండ కోనల్లో వెలసిన శివలింగానికి ప్రకృతి అభిషేకిస్తుంది. మల్లెమడుగు రిజర్వాయర్ గేట్లు తెరుస్తుండటంతో స్వర్ణమ్మ పరవళ్ళు తొక్కుతోంది. రైతులు ఆనందోత్సాహాలతో నార్లు పోసుకోవటానికి సిద్ధమౌతున్నారు. మూడు రోజుల పాటు కుండపోతగా కుమ్మరించిన వరుణ దేవుడు గురువారం శాంతించాడు. అక్టోబర్ మాసంలో కురిసిన వర్షంతో భూగర్భ జలాలను పెంచే శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న భరద్వాజ తీర్థం, పట్టణ నడిబొడ్డులోని నారద పుష్కరిణి, వైష్ణవ కోనేరులకు జలకళ వచ్చింది. రాజీవ్‌నగర్ సమీపంలోని పనస కోనలో వెలసిన ఈశ్వరునికి కొండపై నుంచి 'హర హర' అంటూ నీటి చుక్కలు పడుతున్నాయి. పట్టణానికి చుట్టు ఉన్న కొండలు పచ్చదనాన్ని పరచుకున్నాయి.



**కనువిందు చేస్తున్న వేయిలింగాల కోన:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి దక్షిణాన సుమారు 10కిలో మీటర్ల దూరంలో వెలసిన వేయి లింగాల కోన వద్ద జలపాతం భక్తులను చుట్టుపక్కల ప్రజలకు రెండు కొండల మధ్యన జలధారాలుగా దుముకుతూ కనువిందు చేస్తుంది. ఇక్కడ వర్షంతో జలపాతం దుముకుతుండటంతో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన యువతి యువకులు ఇక్కడ చేరుకొని ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు.

**శివలింగానికి ప్రకృతి అభిషేకం:**

శ్రీకాళహస్తికి సుమారు 4కిలో మీటర్ల దూరంలో కైలాసగిరుల్లో భైరవ కోన ఉంది. ఇక్కడ ఓ శివలింగం కొండ గుట్టలో వెలసి ఉంది. ప్రతి ఏడాది వర్షాకాలం కొండకోనల్లోంచి వచ్చే నీరు సరసరి భైరవ కోనలో వెలసిన లింగంపై దుముకుతూ అభిషేకించినట్లు కనబడుతుంది.

## జాతీయ బిసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా పి.షణ్ముగం



చిత్తూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త: జాతీయ బిసీ సంక్షేమ సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శిగా చిత్తూరు టౌన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ పి.షణ్ముగం ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని విద్యానగర్ జాతీయ బీసీ భవన్‌లో శుక్రవారం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అధ్యక్షతన జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో దక్షిణాది రాష్ట్రాల జాతీయ బీసీ సంక్షేమ సంఘ ఇన్‌ఛార్జీగా వ్యవహరిస్తున్న పి.షణ్ముగంను జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పి.షణ్ముగంకు నియామకపత్రం అందజేశారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా తనను ఎంపిక చేసిన జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నమ్మకంను నిలబెట్టడానికి క్షేత్ర స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు బీసీలను ఐక్యం చేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన పి.షణ్ముగం పేర్కొన్నారు.

## బాలికపై హత్యాచారం...నిందితుడు అరెస్టు!

సత్యవేడు, అక్టోబరు 23 ప్రభాతవార్త: సత్యవేడు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో 16 సంవత్సరాల తమిళనాడు ఊత్తుకోటకు చెందిన ఓ మైనర్ బాలునిపై ఫోక్సో కేసు నమోదు అయింది. సత్యవేడు పోలీసుల కథనం మేరకు... తమిళనాడు తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట రెడ్డివీధిలో తాపీ మేస్త్రి జీవనం సాగిస్తున్న ఒక కుటుంబం ఉంది. తాపీ మేస్త్రికి ఏడు సంవత్సరాల రెండో తరగతి చదువుకునే అమ్మాయి యూకేజీ చదువుకుని అబ్బాయిలు ఉన్నారు. మేస్త్రి భార్య తల్లి ఊత్తుకోట సమీపంలోని ఆంధ్రప్రదేశ్ సత్యవేడు మండలానికి చెందిన దాసుకుప్పంలో కావాంగరై అనే వీధిలో బ్రాంది షాపు వద్ద టిఫిన్ షాపు నడిపేది. తరచూ తాపీ మేస్త్రి పిల్లలందరూ అవ్వ దగ్గరికి వచ్చేవారు. తాపీ మేస్త్రికి భార్య తమ్ముడు, బావమరిది చనిపోవడంతో 16 ఏళ్ళ అతని కుమారుడు టిఫిన్ షాపు నడుపుతున్న తాపీ మేస్త్రి అత్తతో కలసి ఉంటున్నాడు. ఈ నెల 17వ తేదీన తాపీ మేస్త్రి పాఠశాలలో చదువుతున్న తన ఏడేళ్ళ రెండవ తరగతి చదువుతున్న కుమార్తెను యూకేజీ చదువుతున్న తన కుమారుని పాఠశాల నుంచి ఇంటికి తీసుకుని రావాల్సిందిగా 16 ఏళ్ళ బావమరిది కుమారునికి ఫోన్ ద్వారా తెలియజేశాడు. వెంటనే బయలుదేరి పిల్లల వద్దకు వెళ్లిన 16 ఏళ్ళ బాలుడు పిల్లలు ఇద్దరిని తీసుకుని తాను అవ్వతో కలసి ఉన్న దాసుకుప్పం వద్దకు టిఫిన్ షాపుకు వచ్చారు. అక్కడ పిల్లలకు అవ్వ అయిన టిఫిన్ షాపు యజమాని అవసరం నిమిత్తం బయకు వెళ్లారు. ఈ సమయంలో ఏడేళ్ళ రెండవ తరగతి చదువుతున్న అమ్మాయిపై 16 ఏళ్ళ మైనర్ బాలుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు అంటూ పాప తల్లి రిపోర్టు చేసినట్టు తెలియజేశారు. ఈ మేరకు వెంటనే స్పందించిన పుత్తూరు డీఎస్పీ రవికుమార్, శ్రీసిటీ డీఎస్పీ శ్రీనివాసులు దీనిపై ప్రత్యేకంగా పెట్టి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ మేరకు పదహారేళ్ళ మైనరు బాలునిపై బీఎన్ఎస్ 65(2), 5(1) ఆర్/డబ్ల్యు6 ఫోక్సో చట్టాల కింద కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన దర్యాప్తును ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో వేగవంతంగా చేపడుతున్నారు.

## 3.4 కోట్లతో ఆలయ పునర్నిర్మాణంకు భూమిపూజ: ప్రభుత్వ విప్



రామకుప్పం, అక్టోబర్ 23 ప్రభాతవార్త: సిఎం చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేశారని ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం స్థానిక శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయ పునర్నిర్మాణపనులను ఆయన భూమిపూజ చేసి ప్రారం భించారు. ఈఆలయాన్ని 3.4కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రధాన ఆలయాలతో పాటు గ్రామ దేవతల ఆలయాలనుకూడా త్వరలో అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కన్వీనర్ ఆర్.చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నేతలు మునస్వామి, పత్ర నారాయణ, వెంకటరమణ, ఆనందరెడ్డి, విశ్వనాథ్, ఆంజనేయరెడ్డి, సత్యేంద్రశేఖర్, చిని కృష్ణ, చలపతి, జనసేన నరేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఓ కుటుంబానికి ప్రైవేట్‌ప్రమాద బీమా ఐదులక్షల చెక్కును అందజేశారు.